ప్రజాశక్తి
ఆదివారం 23 ఏప్రిల్ 2023
5
శ్రీకాకుళం



రేపు ఎస్‌టి కమిషన్ చైర్మన్ రాక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు ఈనెల 24న జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8.30 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయానికి చేరుకుంటారని తెలిపారు. ఉదయం 10.40 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విశ్వవిద్యాలయ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. సమావేశ అనంతరం విశాఖపట్నం బయలుదేరి వెళ్తారని పేర్కొన్నారు.

కార్మిక హక్కులపై దాడి తీవ్రతరం

మేడేని జయప్రదం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్స్ ద్వారా కార్మిక హక్కులపై దాడిని తీవ్రతరం చేసిందని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు విమర్శించారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో సంఘ జిల్లా విస్తృత సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక చట్టాల అమలుకు సంబంధించిన తనిఖీలు లేకుండా పోయాయని, యజమానుల ఇష్టారాజ్యం నడుస్తోందన్నారు. ఫలితంగా పరిశ్రమల్లో ప్రమాదాలతో కార్మికుల ప్రాణాలు గాలిలో కలసిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయివేటీకరణ, సరళీకరణ విధానాల జోరు పెరిగిన నేపథ్యంలో పోరాడి సాధించుకున్న హక్కులపై పాలకవర్గాలు దాడి చేస్తున్నాయన్నారు. సమ్మె, యూనియన్ ఏర్పాటు, ఉమ్మడి బేరసారాలు, వేతనాలు, సామాజిక భద్రతల హక్కులు కుదించబడుతున్నాయని చెప్పారు. పర్మినెంట్ ఉద్యోగాల స్థానంలో నిర్ణీత కాలవ్యవధి ఉద్యోగాలుగా మార్పు చెందాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అండతో అరబిందో యాజమాన్యం ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను నెరవేర్చకుండా మొండిగా వ్యవహరిస్తోందన్నారు. శ్యామ్‌పిస్టన్స్ ప్లాంట్-2 పరిశ్రమలో 30 ఏళ్ల సర్వీసు పూర్తయిందనే పేరుతో కార్మికులను అక్రమంగా తొలగిస్తున్నారని తెలిపారు. శ్యామ్‌పిస్టన్స్ ప్లాంట్-2, 3, యునైటెడ్ బ్రేవరీస్ పరిశ్రమల్లో కార్మికులకు పూర్తిస్థాయి పనిదినాలు కల్పించాలని, వేతన ఒప్పందాలు వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లయిమ్స్ పరిష్కరించాలని, సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. చిలకపాలెం టోల్‌ప్లాజా కార్మికులను మడపాం, నాతవలస టోల్‌ప్లాజాల్లో సర్దుబాటు చేయాలని చెప్పారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, స్కీమ్‌వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. జీడి, కొబ్బరి, గ్రానైట్ కార్మికులకు కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్‌ఐ అమలు చేయాలన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

మేడేని జయప్రదం చేయాలి

కార్మిక హక్కుల దీక్షా దినం మేడేని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జెండా ఆవిష్కరణలు, ఊరేగింపులు, సభలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఘనంగా నిర్వహించాలన్నారు. చికాగో నగర వీధుల్లో కార్మిక వర్గం రక్తం చిందించిన పోరాట స్ఫూర్తితో కార్మిక హక్కుల పరిరక్షణకు మరో పెద్ద పోరాటం జరగాలని, అందుకు మేడే రోజున కార్మికవర్గం దీక్ష పూనాలన్నారు. అనంతరం మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు ఎ.మహాలక్ష్మి, ఎన్.వి రమణ, ఎ.సత్యనారాయణ, కె.సూరయ్య, జి.అమరావతి, ఎస్.లక్ష్మీనారాయణ, బి.మురళి, హెచ్.ఈశ్వరరావు, ఎన్.షణ్ముఖరావు, కె.కళ్యాణి, పి.లతాదేవి తదితరులు పాల్గొన్నారు.

నమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులు

ఈద్‌ముబారక్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లావ్యాప్తంగా రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. మసీదుల్లో మత గురువులు ఖురాన్ పఠనం, సామూహిక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఈద్‌ముబారక్ చెప్తూ పరస్పరం ఆత్మీయతతో కూడిన ఆలింగనం చేసుకున్నారు. శ్రీకాకుళం నగరంలోని చారిత్రక జామియా మసీదులో వందల సంఖ్యలో ముస్లిములు నమాజ్ చేశారు. నెల రోజుల పాటు ముస్లిములు చేపట్టిన ఉపవాస దీక్ష ముగిసింది.

ప్రార్థనలతో మసీదులన్నీ కళకళలాడాయి. ఉదయాన్నే మసీదులకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువులు రంజాన్ విశేషాలను వివరించారు. అందరూ కలసి సహపంక్తిలో ఫలహారాన్ని స్వీకరించారు. ముస్లిములే కాక ముస్లిమేతర సోదరులు కలిసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. జిల్లాలోని ఇతర మసీదుల్లోనూ రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

విద్యా వ్యవస్థను చులకన చేసే చర్యలు

ప్రవీణ్ ప్రకాష్ తీరును ఖండించిన ఫ్యాప్టో

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మునుపెన్నడూ లేని విధంగా ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తూ, ఎక్కడికక్కడ అక్రమంగా సస్పెన్షన్లు చేస్తున్న విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఫ్యాప్టో చైర్మన్ మజ్జి మదన్‌మోహన్, సెక్రటరీ జనరల్ కె.అప్పలరాజు, పొందూరు అప్పారావు, ఎస్.వి రమణమూర్తి, టి.చలపతిరావు, పి.రామారావు తదితరులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి విద్యాశాఖ, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించడం, నిర్ధారణకు రావడం సరైన పద్ధతి కాదని తెలిపారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రామస్తుల మధ్య ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేయడం, అక్కడికక్కడ సస్పెన్షన్లు చేసే చర్యల వల్ల విద్యారంగం మెరుగుపడదని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను చులకన చేయడం ప్రయివేటు విద్య వైపు ప్రజలు మళ్లడానికి దోహదపడుతుంది గానీ బలోపేతం కాదని తెలిపారు. విధి నిర్వహణలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు అంకితభావంతోనే పనిచేస్తున్నారని స్పష్టం చేశారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు, వర్క్ పుస్తకాలు, యూనిఫారాలు అందజేయడంలో ఉన్న ఇబ్బందులను సరిచేయకుండా చర్యలకు దిగడాన్ని తప్పుపట్టారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు సక్రమంగా చేపట్టకుండా కక్షసాధింపులు, అవమానాలకు గురిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. అవసరమైతే అన్ని ఉపాధ్యాయ సంఘాలతో కలిపి ఉద్యమాన్ని చేపడతామని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్ కుమార్

అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలి : యుటిఎఫ్

పలాస : విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ అక్రమంగా చేసిన సస్పెన్షన్లను ఎత్తివేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ డిమాండ్ చేశారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన యుటిఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రవీణ్ ప్రకాష్ పర్యటన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి కాకుండా ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులను శిక్షించడానికి ఉన్నట్లు ఉందన్నారు. విద్యా వ్యవస్థలో లోపాలను సరిచేయకుండా అందుకు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులను బాధ్యులను చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో యుటిఎఫ్ నాయకులు జి.కోదండరావు. కంచరాన రమేష్, జయరాం, రవీంద్ర, టి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గురుకులాల ప్రవేశ పరీక్ష

శ్రీకాకుళం అర్బన్ : సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ పరిధిలో ఉన్న గురుకులాల్లో 2023-24 విద్యా సంవత్సరానికి గానూ ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి ఈనెల 23న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు గురుకులాల జిల్లా సమన్వయకర్త గ్రేస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఐదో తరగతి, మధ్యాహ్నం ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. కేటాయించిన కేంద్రాల్లో సకాలంలో విద్యార్థులు హాజరు కావాలని స్పష్టం చేశారు.

ప్రతి సెంటుకూ సాగునీటి కల్పన

- 24న మడ్డువలస రెండో దశ పనులు పున:ప్రారంభం
- శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - పొందూరు

ప్రతి సెంటుకూ సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని రాపాక కూడలి సమీపంలోని ఒక కళ్యాణ మండపంలో వైసిపి నాయకులతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్లె శ్రీరాములు నాయుడు జలాశయం (మడ్డువలస) మొదటి దశలో సుమారు 27,500 ఎకరాలకు సాగునీరు అందిస్తుండగా, రెండో దశ విస్తరణ ద్వారా అదనంగా సుమారు 12,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. ఇందుకు అవసరమైన రూ.26.65 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తూ పరిపాలనాపరమైన ఆమోదం తెలిపిందన్నారు. ఇందుకు సంబంధించి ఈనెల 24వ తేదీన పనులను పున:ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ మంత్రి అంబటి రాంబాబు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ హాజరు కానున్నారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మడ్డువలస రెండోదశ విస్తరణ పనుల ద్వారా పొందూరు మండలంలోని తండ్యాం, లక్ష్మీపేట, పొందూరు, రాపాక, వావిలపల్లిపేట, వి.ఆర్.గూడెం, బురిడికంచరాం, ధర్మపురం, కొంచాడ, తోలాపి, పిల్లలవలస, దల్లవలస, కోటిపల్లి గ్రామాలకు ప్రయోజనం కలగనుందని వివరించారు. లావేరు, జి.సిగడాం, ఎచ్చెర్ల మండల్లాలోని పలు గ్రామాలు సస్యశ్యామలం కానున్నాయని తెలిపారు. ధర్మపురం డిస్ట్రిబ్యూటరీ పరిధిలో 12.25 కిలోమీటర్ల మేర 6,400 ఎకరాలకు, అరిణాం అక్కివలస డిస్ట్రిబ్యూటరీ పరిధిలో 10.70 కిలోమీటర్ల మేర 6,100 ఎకరాలు పూర్తిస్థాయిలో సాగులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్‌ఇ పొన్నాడ సుధాకర్, జెడ్‌పిటిసి ఎల్.కాంతారావు, కిల్లి నాగేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షులు పప్పల రమేష్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కె.రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైస్ ఎంపిపి ప్రతినిది వండాన వెంకటరావు, జామి వెంకటరమణమూర్తి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

తాగునీటి ఎద్దడిపై ముందస్తు చర్యలు

జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అధికారులను ఆదేశించారు. మండల అధికారులతో శనివారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. చేతిపంపుల మరమ్మతు పనులు, రక్షిత మంచినీటి పథకాల నిర్వహణకు సంబంధించి ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇని సంప్రదించాలన్నారు. జల జీవన్ మిషన్‌లో భాగంగా రూ.700 కోట్లతో ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీటిని అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. వేసవిలో వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. పంచాయతీల వారీగా ఎక్కడైనా నిధులు అవసరమైతే తక్షణమే మండల అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ 15వ ఆర్థిక సంఘం నిధులతో అత్యంత ప్రాముఖ్యత పనులు చేపట్టాలన్నారు. మండల స్థాయిలో ఈ పనులకు సంబంధించి జెడ్‌పిటిసిలు, ఎంపిపిలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. రెండు, మూడు రోజుల్లో ప్రతిపాదనలు పంపిస్తే సకాలంలో పనులు మంజూరు చేయడానికి వీలవుతుందన్నారు. కోటబొమ్మాళి, జి.సిగడాం, బూర్జ, శ్రీకాకుళం, టెక్కలి, సీతంపేట జెడ్‌పిటిసి సభ్యులు వారి ప్రాంతాల్లో ఎదురవుతున్న సమస్యలను ప్రస్తావించారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ శ్రీనివాస ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎండిఎంయు జిల్లా మహాసభ

శ్రీకాకుళం : మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా ఐదో మహాసభను నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించనున్నట్లు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.మహాలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభకు ముఖ్య అతిథిగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి హాజరవుతారని పేర్కొన్నారు. ఉదయం పది గంటలకు పతాకావిష్కరణ, అనంతరం సభ ప్రారంభవుతుందని తెలిపారు. మహాసభలో ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలను సమీక్షించుకుని, భవిష్యత్‌లో చేపట్టనున్న ఉద్యమాలపై కార్యాచరణను రూపొందిస్తామని వివరించారు.

మాట్లాడుతున్న కమిషనర్ ఓబులేసు

29న టిడ్కో ఇళ్లు పంపిణీ

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో నిర్మించిన 1280 టిడ్కో ఇళ్లను రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మున్సిపల్‌శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చేతుల మీదుగా ఈనెల 29వ తేదీన లబ్ధిదారులకు అందించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.ఓబులేసు తెలిపారు. టిడ్కో అధికారులతో కలిసి టిడ్కో ఇళ్లను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫేజ్-1లో భాగంగా కేటగిరి ఎ కింద 300 చదరపు అడుగుల్లో నిర్మించిన 480 ఇళ్లను, కేటగిరి బి కింద 365 చదరపు అడుగుల్లో నిర్మించిన 192 ఇళ్లను, కేటగిరి సి కింద 430 చదరపు అడుగుల్లో నిర్మించిన 608 ఇళ్లను అందించనున్నట్లు తెలిపారు. రెండో విడతలో 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో 624 ఇళ్లు నిర్మించి ఇవ్వనున్నట్లు చెప్పారు. టిడ్కో ఇళ్ల కాలనీకి మౌలిక సదుపాయాలు, సిమెంట్ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, 24 గంటలు మంచినీటి సరఫరా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, టిడ్కో అధికారులు, మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాలకుల శ్రద్ధ పోర్టుపైనేనా?

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటన ఈ పర్యాయం జిల్లావాసులకు నిరాశనే మిగిల్చింది. జిల్లాకు కొత్తగా వరాలు ఏం ప్రకటించనున్నారోనని అంతా భావించారు. ఒక్క టెక్కలి నియోజకవర్గం మినహా జిల్లాలోని ఇతర ప్రాంతాలకు ప్రయోజనం చేకూర్చే హామీలేవీ సిఎం నోట రాలేదు. అదీ టెక్కలి నియోజకవర్గం సంతబొమ్మాళికి మాత్రమే తాగునీటి కోసం రూ.70 కోట్లతో సమగ్ర మంచినీటి పథకాన్ని ప్రకటించారు. జిల్లాలో ఏదేని ప్రాంతంలో అత్యధిక ఆవాసాలకు మంచినీటిని అందించాలంటే సమగ్ర మంచినీటి పథకం ఎప్పుడూ ఉండనే ఉంది. అధికారులు ప్రతిపాదనలు పంపిస్తే ఆ పథకం ఏర్పాటు పెద్ద సమస్య కానేకాదు. ముఖ్యమంత్రి దాన్నే పెద్ద వరంగా ప్రకటించడం జిల్లా ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసింది. జిల్లాకు సంబంధించి సిఎం ప్రసంగమంతా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలే చుట్టే తిరిగాయి. ఉద్దానం మంచినీటి పథకాన్ని జూన్‌లో జాతికి అంకితం చేస్తామని చెప్పిన ఆయన, దాంతోపాటే జిల్లాకు మంజూరైన కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ సేవలు జిల్లా ప్రజలకు ఎప్పుడు అందుబాటులోకి తీసుకొస్తారో చెప్పలేదంటే, అది ఎప్పుడు పూర్తవుతుందో ఏలిన వారికీ తెలియనట్టు గానే భావించాల్సి ఉంటుంది. వంశధార, నాగావళి నదుల అనుసంధానం ప్రాజెక్టును ఆగస్టులో ప్రారంభిస్తామని మరో ప్రకటన చేశారు. వంశధార స్టేజ్-2 ఫేజ్-2 పథకాన్ని ఎప్పట్లోగా పూర్తి చేసి రైతులకు సాగు నీటి సౌకర్యం అందించనున్నారో చెప్పలేదు.

మూలపేట పోర్టు నిర్మాణంతో ఎక్కువ నష్టపోయేది మత్స్యకారులే కావడంతో వారికి సంబంధించి ఏమైనా వరాలు ప్రకటిస్తారని ఆ సామాజిక తరగతి ఆశగా ఎదురుచూసినా వారికీ ఏమీ దక్కలేదు. జిల్లాలో 193 కిలోమీటర్ల సుదీర్ఘ సముద్ర తీరం ఉన్నా ఎక్కడా కోల్డ్ స్టోరేజ్ లేదు. దీంతో మత్స్యకారులు ఏ రోజు మత్స్య సంపదను ఆ రోజే అమ్ముకోవాల్సి వస్తుండడంతో సరైన ధర దక్కడం లేదు. కోల్డ్ స్టోరేజ్ కావాలని చాలా ఏళ్లుగా మత్స్యకారులు కోరుకుంటున్నారు. మూలపేట శంకుస్థాపనకు వస్తున్న నేపథ్యంలో కోల్డ్ స్టోరేజ్ నిర్మాణంపై ముఖ్యమంత్రి ఏమైనా మాట్లాడతారని మత్స్యకారులు ఆశించారు. తమ పిల్లలను చదివించుకునేందుకు ఆశ్రమ పాఠశాల కావాలని మత్స్యకారులు చాలాకాలంగా అడుగుతూనే ఉన్నా, అదీ నెరవేరని కోరికగానే మిగిలిపోయింది. మూలపేట పోర్టు నిర్మాణంతో ఇక ఆ ప్రాంతంలో చేపల వేట సాధ్యపడదని మత్స్యకారుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. చేపల వేటకు ఇబ్బంది లేకుండా సంతబొమ్మాళి మండలం జగన్నాథపురం ప్రాంతంలో మినీ జెట్టీ నిర్మాణం చేపట్టాలని అధికారుల ముందు మత్స్యకారులు డిమాండ్ ఉంచారు. దానిపైనా సిఎం ఏమీ మాట్లాకపోవడంతో ప్రభుత్వానికి పోర్టుపై ఆసక్తి తప్ప జిల్లాపై గానీ, మత్స్యకారులపై గానీ లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాపై పెద్దగా వరాలు ప్రకటించకుండా నిరాశపరిచిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, అటు సొంత పార్టీ నాయకులనూ నిరాశకు గురిచేశారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లకు వేదికపై అవకాశం కల్పించినా కేవలం ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు మాత్రమే మాట్లాడే అవకాశం కల్పించారు. పర్యటనలో పెద్దగా ప్రాధాన్యం దక్కపోవడం, మాట్లాడే అవకాశం కల్పించకపోవడంతో ముఖ్య నేతలంతా ముభావంగానే కనిపించారు. ముఖ్య నేతలకు మాట్లాడే అవకాశం ఇచ్చి ఉంటే, వారిలో ఒకరిద్దరైనా జిల్లా సమస్యలను ప్రస్తావించి ఉండేవారు. ఆ అవకాశం లేకపోవడంతో ముఖ్యమంత్రి నుంచి ఏ రకమైన హామీ దక్కలేదు. పోనీ మాట్లాడే అవకాశం దక్కిన దువ్వాడ శ్రీనివాస్ జిల్లాకు సంబంధించి ఏమైనా మాట్లాడారా అంటే అదీ లేదు. జిల్లా అభివృద్ధి, సమస్యలు తప్ప అన్నీ మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌ను కీర్తించడానికే సమయం సరిపోయింది.

వైసిపి, టిడిపి సెల్ఫీల వార్

ముఖ్యమంత్రి పర్యటన పూర్తయిన మరుసటి రోజు నుంచి జిల్లాలో వైసిపి, టిడిపిల మధ్య సెల్ఫీల వార్ మొదలైంది. పలాసలో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న కిడ్నీ రీసెర్చ్ సెంటర్ వద్ద మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు సెల్ఫీ దిగి టిడిపి నేతలకు సవాల్ విసిరారు. అందుకు ప్రతిగా టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష టిడిపి హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను పంపిణీ చేయలేదంటూ ఆ ఇళ్ల వద్ద సెల్ఫీ దిగి ప్రతి సవాల్ విసిరారు. ఇరు పార్టీల సెల్ఫీల యుద్ధంతో అసలు వాస్తవాలు బయటపడుతున్నాయి. వైసిపి ప్రభుత్వ హయాంలో జరుగుతుందేమిటో, టిడిపి పాలనలో ఒరగబెట్టిందేమిటో జనం తెలుసుకుంటున్నారు. వైసిపి, టిడిపిలు ఇకనైనా సెల్ఫీల వార్‌కు స్వస్తి చెప్పి జిల్లా అభివృద్ధిపై, ప్రజా సమస్యలపై దృష్టిసారిస్తే జనానికి కొంతైనా మేలు చేకూరుతుంది.

ప్రకటన

శ్రీకాకుళం పట్టణంలో గల బలగ నివాసి అయిన పాలకొండ సూర్యవతి W/o లేటు సూర్యానారాయణ పేరుతో ఉన్న సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.924/84 తేదీ 14-04-2023న బలగ జంక్షన్‌లో పై తెలిపిన డాక్యుమెంట్ జిరాక్స్ తీసుకొని ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో పడి పోయింది.కావున ఎవరికైన దొరికి నట్లుయితే పాలకొండ సూర్యవతి కు కానీ శ్రీకాకుళం 2వ పట్టణ పోలీస్ స్టేషన్ కి అప్పగించాలని విజ్ఞప్తి.

9951052040

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
I.P. 02/2023

Between:-
Potnuru Ashok Kumar --Petitioner
And:-
Ch. Venkata Rao and 7others --Respondents

పబ్లిక్ నోటీస్

యావన్మంది ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా పై నెంబరు కేసును పిటీషనర్‌ను Insolvent గా డిక్లర్ చేయమని కోరుచూ పై కోర్టులో ఫిటీషన్‌ను దాఖలు చేసినాడు కావున ఎవరికి ఏ విదమైన అభ్యంతరములుఉన్న యెడల **తేll 25-04-2023 దిన ఉll10-30 గంllలకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల అక్షేపణలు తెలియపర్చుకొనవలేను. లేని యెడల పిటీషనర్‌కు అనుకులంగా తీర్మాణించడమగునని ఇందుమూలంగా తెలియ పర్చడమైనది.

// By order //
కె. శంకరరావు
న్యాయవాది,
శ్రీకాకుళం
ఫోన్: 9491567435

IN THE HONOURABLE COURT OF THE 3RD ADDITIONAL DISTRICT JUDGE AT SRIKAKULAM
A.S 110/2019

Between: Pedada @ Pedda Rama Rao, S/o Geddayya, hindu, Aged about 78 years, Cultivation,R/o Door No.4-67, Mulavalaspuram village, Sarubujjili mandal, Srikakulam District.
--Petitioner/Appellant/Plaintif in O.S 177/2015
And: Ponnada Simhachalam, S/o Thavudu, Hindu, aged about 48 years, R/o Door no.4-1-126, Boddepallipeta Village, Ward no.4.,Amadalavalasa Municipality, Srikakulam District.
--Respondent/ Defendnat in O.s.177/2015

NOTICE

Please take this notice that the above matter is posted to 25/04/2023 for your appearance. You are hereby directed to appear before the Hon'ble Court on **24/04/2023 at 10.30 A.M.,** either in person or through an Advocate without fail and file your objections if any, otherwise the matter will be decided in your absence.

By Court Order

PV RAMANA DAYAL
Advocate for Plaintiff
Cell:9849171366

మహారాజశ్రీ శ్రీకాకుళం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి కోర్టులో
A.S 31/21

Between:
కె.కె. ప్రేమ్‌జీ -వాది/అప్పిలెంట్
And:
కె.కె. జ్యోతి వగైరాలు -ప్రతివాదులు/ రెస్పాండెంట్లు
To,
D-1. కె.కె.జ్యోతి, w/o లేటు కె.కె మధు, సాllమిని ఇండస్ట్రీయల్ ఎస్టేట్,పాలకొండ రోడ్డు, శ్రీకాకుళం.
D-2. కె.కె.పూర్ణ, D/o లేటు కె.కె.మధు, సాllమిని ఇండస్ట్రీయల్ ఎస్టేట్, పాలకొండ రోడ్డు, శ్రీకాకుళం.
D-3. కె.కె.పుష్కల్, D/o లేటు కె.కె. మధు, సాllమిని ఇండస్ట్రీయల్ ఎస్టేట్, పాలకొండ రోడ్డు, శ్రీకాకుళం.
D-4 సి.కె.బైజు, S/o లేటు సి.కె కుంజన్, సాllమిని ఇండస్ట్రీయల్ ఎస్టేట్, పాలకొండ రోడ్డు, శ్రీకాకుళం.
D-5 సి.కె.బాబు, S/o లేటు సి.కె. కుంజన్ సాllమిని ఇండస్ట్రీయల్ ఎస్టేట్, పాలకొండ రోడ్డు, శ్రీకాకుళం.
D-6. సి.కె వెనుతం, S/o లేటు సి.కె. కుంజన్ సాllమిని ఇండస్ట్రియల్ ఎస్టేట్, పాలకొండ రోడ్డు, శ్రీకాకుళం.
D-7 కె. కె. సోమావతి, D/o లేటు సి.కె కుంజన్ సాllమిని ఇండస్ట్రీయల్ ఎస్టేట్, పాలకొండ రోడ్డు, శ్రీకాకుళం.
D-8. బి.జ్యోతి,D/o లేటు సి.కె.కుంజన్, సాllమిని ఇండస్ట్రీయల్ ఎస్టేట్, పాలకొండ రోడ్డు, శ్రీకాకుళం.

నోటీసు

పై నెంబరు అప్పీల్లో అప్పిలెంట్ అయిన **కె.కె ప్రేమ్‌జీ, రెస్పాండెంట్లు** అయిన మీపై అప్పీల్ షెడ్యూల్ ఆస్తి అప్పిలెంట్ పొజిషన్లో ఉన్నదన్నిని డిక్లరేషన్ మరియు ట్రాన్ఫర్- ఆఫ్ ఎలాట్ మెంట్ and రిజిస్ట్రేరీ క్రియ చీటి అప్పిలెంట్ పేర చేయించమని కోరుతూ దాఖలు చేసిన దాంట్లో రెస్పాండెంట్లు అయిన మీయొక్క నోటీసులు నిమిత్తం వాయిదా **తే॥11-05-2023ది॥కి యున్నది. ఆ దినము ఉదయం 10.30 గం॥** లకు పై కోర్టులో మీరు స్వయంగా గాని లేక మీ తరుపు న్యాయవాది ద్వారా గాని హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలియజేసుకోవలెను, లేని యెడల వున్న రికార్డు ప్రకారం కోర్టువారు తీర్మానించెదరని యిందు మూలంగా తెలియజేయడమైనది.

పాలిశెట్టి మురళి కృష్ణ
అప్పిలెంట్ తరుపు న్యాయవాది,
శ్రీకాకుళం,
ఫోన్: 9440371133

శ్రీకాకుళం
తేది: 22-04-2023

ఆందోళన చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

భయభ్రాంతులకు గురిచేయొద్దు

ప్రజాశక్తి- టెక్కలి

విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ విద్యాశాఖాధికారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఫ్యాప్టో నాయకులు బొడ్డేపల్లి నేతాజీ అన్నారు. ఆయన అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా ఎంఆర్‌సి వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ సెలవు రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఇళ్లకు వెళ్లి విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయుల పనితీరుని పరిశీలించడం సరైనది కాదన్నారు. గ్రామస్తుల, తల్లిదండ్రుల సమక్షంలో ముఖ్యకార్యదర్శి ఆగ్రహం వ్యక్తం చేయడం, అక్కడికక్కడే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవడం సమంజసం కాదని అన్నారు. ఇటువంటి చర్యలు వల్ల విద్యారంగం మెరుగుపడదన్నారు. విద్యాశాఖను అవమానపరిచే చర్యలను విడనాడాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకుండా చర్యలకు ఉపక్రమించడం భావ్యం కాదన్నారు. ఆందోళలో పొట్నూరు జగదీష్, పాలవలస ధర్మారావు, నంబాళ్ల వాణిశ్రీ, ఎస్.మోహనరావు, వజ్జ ఆదినారాయణ, డి.లక్ష్మీనారాయణ, గున్న ప్రసాదరావు, కె.వేణుగోపాలరావు, చల్లా రామారావు, యు.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మతోన్మాదులను ఓడించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశ ప్రజాస్వామ్యానికి ముప్పుగా పరిణమిస్తున్న బిజెపి, మతోన్మాద శక్తుల పాలనను రానున్న ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం, సిపిఐలు నాయకులు పిలుపునిచ్చారు. నగరంలో తురాయి చెట్టు వీధి, వైష్ణవువీధి, మహిళా మండలి వీధి, తెప్పల వీధుల్లో ప్రచారభేరి కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి బిజెపి ప్రజావ్యతిరేక పాలనపై ముద్రించిన పోస్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ నగర కార్యదర్శులు టి.తిరుపతిరావు, డోల శంకరరావు మాట్లాడుతూ మోడీ, అమిత్ షా నాయకత్వంలో బిజెపి-ఆరెస్సెస్ కూటమి దేశ ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో పక్క ప్రభుత్వ సంస్థలను, సహజ వనరులైన అడవులను, భూములను, విద్యుత్ ప్రాజెక్టులను, గనులను కార్పొరేట్ కంపెనీలకు అప్పనంగా కట్టబెడుతున్నారని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెంచి పేదల నడ్డి విరుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు పరిష్కానికి ప్రజాపోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కె.భాస్కరరావు, బి.లక్ష్మి, ఎస్.శ్రీనివాసులు, బి.సింహాచలం, త్రినాథరావు, రవి పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వామపక్ష నాయకులు

నవోదయ మోడల్ ప్రవేశ పరీక్షకు స్పందన

ప్రజాశక్తి- పలాస

ప్రాథమిక స్థాయి నుంచే పోటీతత్వం అలవర్చుకోవాలని, అందుకు యుటిఎఫ్ ఆధ్వర్యాన నిర్వహించిన నవోదయ మోడల్ ప్రవేశ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ అకడమిక్ సెల్ ఆధ్వర్యాన ఆరో తరగతి ప్రవేశానికి నవోదయ ప్రవేశ మోడల్ పరీక్షను శనివారం నిర్వహించారు. ఈ పరీక్షకు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. డాక్టర్ కూన మోహన్‌బాబు మాట్లాడుతూ ఎటువంటి రుసుం లేకుండా యుటిఎఫ్ ఏటా ఇటువంటి మోడల్ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం మొదటి పది ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చిన్నంనాయుడు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంపతిరావు కిషోర్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు, బల్ల చిట్టిబాబు, జిల్లా నాయకులు కంచరాన రమేష్, అకాడమిక్ సెల్ కన్వీనర్ ఎల్.వి.చలం, మండల అధ్యక్ష, కార్యదర్శులు తలగాపు అప్పారావు, ఎస్.వి.రమణ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : యుటిఎఫ్ ఆధ్వర్యాన నవోదయ మోడల్ ప్రవేశ పరీక్షకు స్పందన లభించింది. ఈ మోడల్ ప్రవేశ పరీక్షకు 152 మంది పాల్గొని పరీక్ష రాశారు. ఈ పరీక్షలో ఇన్నీసుపేటకు చెందిన డి.సురేష్, ముత్యాలపేట, కంచిలికి చెందిన సిహెచ్.మనోగ్రాని, ఎం.రంజాన్, హర్షవర్ధన్ విజేతలుగా నిలిచారు. ముందుగా నవోదయ మోడల్ ప్రవేశ పరీక్ష పేపర్లు మున్సిపల్ కమిషనర్ రమేష్, ట్రస్టీ చైర్మన్ రాంబాబు ఆవిష్కరించారు. పరీక్షకు హాజరైన విద్యార్థులకు అల్పాహారాన్ని వైద్యులు డాక్టర్ శేషు యాదవ్, వస్త్ర వ్యాపారి బత్తుల వెంకటరమణ విరతణ చేశారు. యుటిఎఫ్ నాయకులు ఎ.శ్రీనివాసరావు, ధనుంజయ్, కాశీనాథ్ రతో, ప్రకాష్, చంటిబాబు, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పలాస : మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

కంచిలి : యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యాన జవహర్ మోడల్ నవోదయ మోడల్ పరీక్ష కంచిలి ఎంపిపి పాఠశాలలో నిర్వహించారు. ఈ పరీక్షల్లో కంచిలి విజ్ఞాన్ పాఠశాలకు చెందిన దాసరి ఓంకార్ శ్రీనివాస్ ప్రథమ స్థానంలో, కె.ప్రశాంత్ ద్వితీయ స్థానంలో, కంచిలి ఎంపిపి పాఠశాల విద్యార్థి జాక ధీరజ్ తృతీయ స్థానంలో నిలిచినట్లు ఎంఇఒ శివరాం ప్రసాద్ తెలిపారు. విజేతలకు ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పురందర బిసాయి, యుటిఎఫ్ ప్రతినిధులు నల్లన రవి, సుదర్శన్ బెహరా, జె.భగవత్‌రావు, ఎస్.వెంకటరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ దుర్యోధన పాల్గొన్నారు.

సోంపేట : యుటిఎఫ్ మండలశాఖ ఆధ్వర్యాన సోంపేట బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నవోదయ మోడల్ ప్రవేశ పరీక్షకు 153 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్షల్లో బి.ప్రిషిత ప్రథమ, అమృత వర్షిని ద్వితీయ, పి.ప్రియాంక తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఎంపిపి డాక్టర్ ఎన్.దాసు ప్రోత్సాహకాలను అందజేశారు. అనంతరం ఇటీవల డాక్టరేట్ పొందిన ఉపాధ్యాయుడు నగిరి మోహనరావును సంస్థ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు దొరబాబు, గురునాథ్, జి.శ్రీనివాసరావు, ఎల్.రవి, జి.ప్రకాశరావు, ఎస్.కూర్మారావు, టి.కాళిదాసు, కె.సర్వేశ్వరరావు, జి.సింహాచలం, ప్రసాద్, తేజశ్వరరావు, బి.బాబూరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కంచిలి : విజేతలతో యుటిఎఫ్ నాయకులు

సోంపేట : మెమోంటోను అందజేస్తున్న ఎంపిపి దాసు

ఓర్వలేకే చంద్రబాబుపై రాళ్ల దాడి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నాలుగేళ్ల జగన్ పాలనలో ప్రజలు తీవ్రంగా నష్ట పోయారని, మరోవైపు క్షేత్ర స్థాయిలో అన్ని వర్గాల ప్రజలపై దాడులు జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. వారిని ఆదుకునేందుకు చంద్రబాబు అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తున్నారని, చంద్రబాబు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే మంత్రి సురేష్ నేతృత్వంలో రాళ్ల దాడులకు తెగబడ్డారని అన్నారు. నగరంలోని ఏడు రోడ్ల జంక్షన్ వద్ద టిడిపి ఆధ్వర్యాన ఎర్రగొండపాలెంలో జరిగిన దాడులకు నిరసనగా టిడిపి నాయకులు శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి మొదలు, మంత్రులు, ఎమ్మెల్యేల వరకు అసహనానికి గురై ప్రజలపైన ప్రతిపక్ష నాయకులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. బాధ్యతగల మంత్రి హోదాలో ఉన్న ఆదిమూలపు సురేష్ ప్రోత్సాహంతోనే ఈ దాడులు జరిగాయని, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి చిట్టి నాగభూషణం, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ముద్దాడ కృష్ణమూర్తినాయుడు, మీడియా కో-ఆర్డినేటర్ జామి భీమశంకర్, ఉపాధ్యక్షులు చిట్టి మోహన్, రూరల్ మండల అధ్యక్షులు సీర రమణయ్య, గార మండల ప్రధాన జల్లు రాజీవ్, రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు శిల్లా శ్రీనివాస్, పొట్నూరు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు

గొండు శంకర్...

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబుపై వైసిపి నాయకులు రాళ్ల దాడికి పాల్పడడం అప్రజాస్వామికమని టిడిపి నాయకులు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ వ్యాఖ్యానించారు. నగరంలోని విశాఖ-ఎ కాలనీలో ఉన్న ఆయన వ్యక్తిగత కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

పొందూరు: చంద్రబాబుపై వైసిపి నాయకులు రాళ్లతో దాడి చేయడం రాష్ట్రంలో రౌడీయిజం, అరాచకపాలనకు నిదర్శనమని టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, ఎఎంసి మాజీ చైర్మన్ అన్నెపు రాము, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కరరావులు అన్నారు. మండలం కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు.

చిన్నారి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి మహాలక్ష్మి

చిన్నారికి అంత్యక్రియలు

జి.సిగడాం : మండలంలోని మెట్టవలసలో కుక్కల దాడిలో సాద్విక (16 నెలలు) శుక్రవారం రాత్రి మృతి చెందిన విషయం విదితమే. పైల రాంబాబు, మహాలక్ష్మి దంపతుల ద్వితీయ కుమార్తె సాద్విక మంచంపై ఉన్న సాద్వికను కుక్కలు నోటితో తీసుకొల్లి తీవ్రంగా గాయపరిచాయి. వెంటనే కుటుంబ సభ్యులు విజయనగరం జిల్లా రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. శనివారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం సాద్విక మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చి విషాదవదనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. చిన్నారి మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎస్ఐ సిహెచ్.రామారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అంత్యక్రియల్లో వైసిపి, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

గిరిజన సంఘ నాయకులకు నోటీసులు

ప్రజాశక్తి- పలాస

ఎస్‌టి జాబితాలో ఇతర తరగతులను చేర్పించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, జిఒ నంబరు 52ను తక్షణమే రద్దు చేయాలని, అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెనుకకు తీసుకోవాలని, లేని పక్షంలో సోమవారం తాడేపల్లి సిఎంఒ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని గిరిజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కాశీబుగ్గ పోలీసులు ముట్టడికి వెళ్లనీయకుండా ముందస్తుగా సంఘ నాయకులు శనివారం నోటీసులు అందజేశారు. ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సవర జగన్నాయుకులు, జిల్లా జెఎసి అధ్యక్షులు సవర రాంబాబు, ఎంప్లాయిస్ ఫెడరేషన్ మండల అధ్యక్షులు పెద్దింటి ఈశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ మెంబెర్ సవర మోహనరావు, సవర సోమేశ్వరరావులకు పోలీసుల ఇంటికీ వెళ్లి నోటీసులు అందజేశారు.

జగన్నాయకులుకు నోటీసు అందజేస్తున్న పోలీసులు

మాట్లాడుతున్న ఈశ్వరరావు

'ఎన్ఇఆర్' స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఇంటర్ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఇంటర్ తరగతులను స్కూల్ డైరెక్టర్ తేజ అధ్యక్షతన శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కేంద్రం నుంచి ఎన్‌సిసి యూనిట్ హెడ్ అమిత్ బెనర్జీ, స్కూల్ చైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను విజయపథంలో నడిపించేందుకు మంచి ఉపాధ్యాయులు ఉండడం ఎంతో ముఖ్యమన్నారు. ఇన్నోవేషన్, ఇన్వెన్షన్ మధ్య వ్యత్యాసం గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి మహంతి, వైస్ ప్రిన్సిపాల్ ఎన్.సుధీర్‌కుమార్, హెచ్ఒడిలు, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న టిడిపి నాయకులు

అచ్చెన్నను కలిసిన నాయకులు

కోటబొమ్మాళి : టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు మండలంలోని నిమ్మాడలో ఉన్నారన విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నరసన్నపేట మండలం జమ్ము, నందిగాం మండలం పెంటూరు, కోటబొమ్మాళి మండలం చౌదరికొత్తూరు, పాలకొండ, సంతబొమ్మాళి మండలం తాళ్లవలస, టెక్కలి మండలాల నుంచి టిడిపి కార్యకర్తలు తరలివచ్చారు. అనంతరం అచ్చెన్నాయుడుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా తమతమ గ్రామాల్లో టిడిపి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ఇప్పటి నుంచే గ్రామస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చల్ల సింహాచలం, మండవెళిల మోహనరావు, శిమ్మ అప్పారావు, శిమ్మ వెంకటరావు, నక్క కృష్ణారావు, వెలమల అప్పారావు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

'ఐతమ్'లో పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల బిఎస్ఇండ్వైచ్ విభాగం హెచ్ఒడి ప్రొఫెసర్ ఆర్.శాంతికుమార్ 'అప్లికేషన్స్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్' అనే పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తన ఛాంబర్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ రంగంలో ప్రాధాన్యం ఉన్న కృత్రిమ మేధా, మిషన్ లెర్నింగ్, బిగ్ డేటా ఎనాలసిస్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్‌లో నూతన పరిశోధనలు చేసే అధ్యాపకులకు, విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, పుస్తక రచయిత ప్రొఫెసర్ ఆర్.శాంతికుమార్, ప్రొఫెసర్ అగతమూడి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

'ఆఫ్‌షోర్' పనులు అడ్డగింత

ప్రజాశక్తి- పలాస

మండలంలోని రేగులపాడు వద్ద నిర్మిస్తున్న ఆఫ్‌షోర్ రిజర్వాయఉకు సంబంధించి భూములు కోల్పోతున్న నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాకే పనులు చేపట్టాలని సిపిఐ జిల్లా నాయకులు చాపర వెంకటరమణ డిమాండ్ చేశారు. మండలంలోని రేగులపాడు, మెళియాపుట్టి మండలం చీపురుపల్లి గ్రామాల్లో చేపడుతున్న ఆఫ్‌షోర్ నిర్మాణ పనులను సిపిఐ ఆధ్వర్యాన నిర్వాసితులు శనివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి 21న టెక్కలి సబ్ కలెక్టర్ రిజర్వాయరు నిర్వాసితులతో చీపురుపల్లి లో గ్రామసభ ఏర్పాటు న్యాయం చేస్తామన్న హామీ ఇచ్చారని, ఇప్పటికీ న్యాయం జరగలేదని అన్నారు. 2013 చట్టం కింద నిర్వాసితులకు రావాల్సిన భూ పరిహారం, కుటుంబ, యూత్ ప్యాకేజీలు ఇవ్వాలన్నారు. ఆర్అర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, చీపురుపల్లి సర్పంచ్ ఈశ్వరరావు, యూత్ నాయకులు బుజ్జి, సోమేష్, చాపర సోమేష్, బద్రి వినోద్‌కుమార్, శివరామ్, నందిగాం మోహనరావు పాల్గొన్నారు.

నిర్వాసితులతో మాట్లాడుతున్న వెంకటరమణ

వైసిపి పాలనలో సంక్షోభంలో రాష్ట్రం

ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- ఆమదాలవలస

వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి పాలయ్యిందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. పురపాలక సంఘంలోని 13వ వార్డు పరిధిలోని కిల్లివారి క్వార్టర్స్, విద్యానగర్ ప్రాంతాల్లో శనివారం రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే మన రాష్ట్రంలోనే పెట్రోల్, డీజిల్, విద్యుత్, నిత్యవసరాలు ధరలు అత్యధికంగా ఉన్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యం వల్ల ప్రతి కుటుంబం నెత్తిన అధిక భారం పడి ఇబ్బందుల పాలవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం, గంజాయి వంటి మాదకద్రవ్యాలు ఉత్పత్తిలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉన్నదని ఎద్దేవా చేశారు. కనీసం ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ మాట్లాడుతూ దేశంలో రాజధాని లేని ఒకే ఒక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, ఇదే అంశంపైన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మూడు రాజధానుల పేరుతో ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టి సైకో ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తమ్మినేని గీత, టిడిపి పట్టణ అధ్యక్షుడు సంపదరావు మురళి, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు మెండ దాసునాయుడు, తమ్మినేని విద్యాసాగర్, కిల్లి మార్కండేయులు, బోర గోవిందరావు, ఇంజరాపు విశ్వనాథం, గొండు రమణ, బుడుమూరు గోవిందరావు పాల్గొన్నారు.

రామ్మోహనరావుతో మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని బలగ ప్రాంతంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. కార్యక్రమంలో చిట్టి నాగభూషణం, మూకళ్ల సింహాద్రి, రెడ్డి సూర్యనారాయణ, ఎం.రామారావు, చిట్టి రాము, వెంకటేష్, పి.ఎం.జె.బాబు, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు హరగోపాల్, పార్వతీశం పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

ముస్లిములతో స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పర్వదినమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. రంజాన్ పర్వదిన సందర్భంగా పట్టణంలోని మసీదులో ముస్లిములతో కలిసి శనివారం ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాతృత్వం, క్రమశిక్షణ, ధార్మిక చింతన కలయికలే రంజాన్ మాసం విశిష్టత అని అన్నారు. ముస్లిముల శ్రేయస్సు, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుసుమంచి శ్యామ్‌ప్రసాద్, వైసిపి నాయకులు బొడ్డేపల్లి వెంకటరమణమూర్తి, బొడ్డేపల్లి రాజు, సాధు చిరంజీవి, జిలాని, బకారి పాల్గొన్నారు.

అలాగే పట్టణంలోని మసీదులో నిర్వహించిన రంజాన్ వేడుకల్లో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు పాల్గొన్నారు. అనంతరం ఇఫ్తార్ విందుకు రఫీ, జీలాని ఆహ్వానం మేరకు విందులో పాల్గొన్నారు. ఈయనతోపాటు సరుబుజ్జిలి జనసేన మండల అధ్యక్షుడు పైడి మురళీమోహన్, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని జామియా మసీదులో ముస్లిం సోదరులు ఉపవాసదీక్షలను విరమించి ఈద్-ఉల్-ఫితర్‌ను జరుపుకున్నారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పాల్గొని ముస్లిములకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో షేక్ ముబారక్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఇస్మాయిల్ అది (సాను), నియోజకవర్గ అధ్యక్షులు రోషన్ భాష, జిల్లా కార్యనిర్వాహ అధికారి సయ్యద్ షఫీ, నియోజకవర్గ ఉపాధ్యక్షులు, సయ్యద్ హబీబ్, జిల్లా కార్యదర్శి, జిల్లా తెలుగు యువత కార్యదర్శి సాధు వెంకటేష్, జిల్లా బిసి సోషల్ మీడియా కన్వీనర్ బుక్క యుగంధర్ పాల్గొన్నారు.

రణస్థలం : రణస్థలం జామియా మసీదు ఈద్గా ఆవరణలో పవిత్ర మాసం రంజాన్ ఉపవాస దీక్షలను ముస్లిం సోదరులు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఫకద్దీన్ సాహెబ్, ముతవల్లి అబ్దుల్ రహమాన్ సాహెబ్ మస్తాన్, పెద్ద మస్తాన్, తాజ్, డాక్టర్ భాష సాహెబ్, జానీ మాస్టర్, రఫీ, సుభాని పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోగల పాకివలస, కొత్తపేట, నిమ్మాడ, దంత, కోటబొమ్మాళి గ్రామాల్లో ముస్లిములు తమతమ బంధువులతో రంజాన్ పండగను ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కో-ఆప్షన్ మెంబర్ షేక్ రాజు తన బంధువులు, స్నేహితులతో పండగను ఘనంగా నిర్వహించారు.

భర్త, కుటుంబసభ్యుల నుంచి రక్షణ కల్పించాలి

జిల్లా అదనపు జడ్జికి మహిళ ఫిర్యాదు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆడ పిల్లలకు జన్మనిచ్చిన కారణంగా తనను భర్త, కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని పలాస మున్సిపాలిటీలోని జయరామచంద్రపురానికి చెందిన యశోద జిల్లా అదనపు జడ్జి వెంకటేశ్వరరావు వద్ద మహిళా సంఘాల ఆధ్వర్యాన శనివారం మొరపెట్టుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జయరామచంద్రపురానికి చెందిన బద్రి నాగార్జునతో 12 ఏళ్ల క్రితం వివాహమైందన్నారు. హాని, శ్రీనిధి ఇద్దరు కుమార్తెలు ఉన్నారని వివరించింది. మూడేళ్ల నుంచి మగ పిల్లలను కనలేదంటూ తనను వేధిస్తున్నారని కన్నీటిపర్యంతమైంది. వేధింపులు తాళలేక మహిళా సంఘాల సహకారంతో ఏడాది కాలంగా భర్తకు దూరంగా ఉంటున్నారని అన్నారు. ఈ నెల 9న రాత్రి 11 సమయంలో భర్త నాగార్జునతో పాటు నలుగురు దుండగులు దాడి చేసేందుకు ప్రయత్నించారని అన్నారు. స్థానికుల సహకారంతో ఆ దాడి నుంచి తప్పించుకున్నట్లు వివరించారు. అనంతరం కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తనకు, తన కుమార్తెలకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని ఆమె కోరారు. అలాగే జిల్లా ఎస్‌పి కార్యాలయంలోనూ, దిశా పోలీస్ స్టేషన్‌నూ, మహిళా హ్యూమన్ రైట్స్‌కు తాను ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ఆమెతో పాటు ప్రజా సంఘాల నాయకులు పి.కుసుమ, పి.అరుణ, జినగ లోకేశ్వరి, ఈశ్వరి కె.హేమవతి, పి.నాగమణి, జ్యోతి, మానవ హక్కుల నేత కె.వి.జగన్నాథరావు, మద్దిల రామారావు, గొరకల బాలకృష్ణ, ఎన్.గణపతి, పి.దానేసు, గోపి పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధిత మహిళ

సమీక్షిస్తున్న ఎపిఎం కూర్మారావు

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతానికి మహిళా సమాఖ్య సిబ్బంది కృషి చేయాలని ఎపిఎం పైడి కూర్మారావు సూచించారు. పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య సిబ్బందితో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఇళ్ల లబ్ధిదారులందరూ సామూహిక గృహప్రవేశాలు చేసుకోవడానికి వీలుగా కృషి చేయాలన్నారు. ఎ-గ్రేడ్‌లో ఉన్న సంఘ సభ్యులందరికీ అవసరం మేరకు, ఇళ్లు కట్టుకోవడానికి కావాల్సిన రుణాలను మంజూరు చేయించాలని సూచించారు. గృహ నిర్మాణ సంస్థ ద్వారా హౌసింగ్‌లోన్ మంజూరు చేయించాలన్నారు. స్వయం శక్తి సంఘాల్లో సభ్యులుగా ఉన్న ఇళ్ల లబ్ధిదారులందరికీ రూ.35 వేలు రుణాలు ఇప్పించాలన్నారు. ఇప్పించిన అన్ని రుణాలను గ్రామ సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్ లాగిన్‌లో అప్‌డేట్ చేయించాలన్నారు. గ్రామాల్లో మహిళా రైతులతో ఏర్పాటు చేయించి, ఆరు నెలల పూర్తయి పంచసూత్రాలు పాటిస్తున్న రైతు ఉత్పత్తిదారుల సంఘాలన్నింటికీ బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించాలని అన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అకౌంటెంట్ కళ్యాణి, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు సుభద్ర, చంద్రరావు, రమణ, రామప్పడు పాల్గొన్నారు.

అలయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం అర్బన్ : నగరంలో 2023-24 సంవత్సరానికి అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ (105) శ్రీకాకుళం నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఈ మేరకు ఎన్నికైన నూతన కార్యవర్గం చార్టర్డ్ అకౌంటెంట్, పూర్వపు అంతర్జాతీయ అధ్యక్షులు వి.ఎం.రావు సమక్షంలో సన్ కన్వెన్షన్ హాల్లో శనివారం ప్రమాణ స్వీకారం జరిగింది. అధ్యక్షునిగా పొట్నూరు నాగేశ్వరరావు, కార్యదర్శిగా బరాటం కుమారస్వామి, కోశాధికారిగా వి.వివేకానందలు ఎన్నికయ్యారు. అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ తరపున టి.వెంకటరమణ, ఎ.విద్యాసాగర్, కె.గాంధీ, డాక్టర్ పి.శాంతమ్మ, హెచ్.మురళీధర్, ఉషారాణి, పి.చిరంజీవులు, ఎస్.గోవిందరావు, జె.చంద్రశేఖర్, పొట్నూరు కృష్ణమోహన్, బోయిన రమణయ్య, రమేష్, పి.వేణు, శివమాస్టర్, ఎ.రామారావు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న క్లబ్ సభ్యులు

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం

బూర్జ : ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రతిఒక్కరూ నిషేధించాలని ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ కూన సన్యాసిరావు అన్నారు. మండలంలోని పెద్దపేట ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థలో ధరిత్ర దినోత్సవ సందర్భంగా శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయనకు పురుగు మందులు వాడకం తగ్గించి సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం చేయాలని రైతులకు సూచించారు. పెళ్లయిన నూతన జంత, పుట్టిన రోజున మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కో-ఆర్డినేటర్ అనూప్, మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీ సిఇఒ బి.శంకరరావు, ఎం.రవీంద్రనాథ్, గణేష్, సూర్యనారాయణ, ఆదివాసీ సహజ ఎఫ్‌పిసి పాల్గొన్నారు.

బూర్జ : అవగాహన కల్పిస్తున్న సన్యాసిరావు

శ్రీకాకుళం అర్బన్ : వాతావరణ కాలుష్యంతో భూతాపాన్ని తగ్గించడానికి ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు, వాకర్స్ క్లబ్ ఇంటెర్నేర్షనల్ అధ్యక్షులు హారికాప్రసాద్, శాసపు జోగినాయుడు అన్నారు. నగరంలోని సానా వీధిలో ఉన్న ఆయన కార్యాలయ ఆవరణలో శనివారం ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ జి.ఇందిరాప్రసాద్, జి.సత్యనారాయణ, మారుతీ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు కొంక్యాన మురళి, స్టార్ వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు బి.దేవీప్రసాద్, నటుకుల మోహన్, బడాన దేవభూషణ్‌రావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న హారికాప్రసాద్

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- పొందూరు
రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని బొడ్డేపల్లిలో జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింట కుళాయిలను శనివారం ప్రారంభించారు. అనంతరం మొదలవలసలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందజేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. ఇందులో భాగంగా ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, తహాశీల్దార్ ఎస్.రాంబాబు, ఎంఇఒ పి.వి.రామరాజు, ఎపిఒ శ్రీనివాసరావు, ఎపిఎం శ్యామలరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ చైతన్య, ఎఒ బాబ్జి, ఎఇ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

కోటబొమ్మాళి: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలను ప్రభుత్వం అమలు చేస్తుందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కిష్టుపురంలో సర్పంచ్ బొడ్డు వెంకటరమణ అధ్యక్షతన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీనీ సిఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేశారని అన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని చిన్నారులకు, గర్భిణీలకు అందించాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, మండల సచివాలయ కన్వీనర్లు ఇన్‌ఛార్జి గడ్డవలస నాగభూషణరావు, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు దుక్క రోజా, మండల కో-ఆప్షన్ మెంబర్ షేక్ రాజు, ఎంపిటిసి బొడ్డు చెంచులు, ఉప సర్పంచ్ కమిలి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

'ట్రూ హ్యాండ్స్' చేయూత

కంచిలి : కంచిలికి చెందిన ట్రూ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తోంది. మండలంలోని చిన్నశ్రీరాంపురానికి చెందిన యోగేంద్ర అనే బాలుడి అనారోగ్యానికి గురయ్యారు. చికిత్స అందించేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో దాతల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ మేరకు ట్రూ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ బాలుడి చికిత్స కోసం రూ.14 వేలు శనివారం అందజేశారు. అలాగే బొరివంకకు చెందిన నిరుపేద వంటరి మహిళ ఇంటి నిర్మాణానికి రూ.5 వేలు విలువ చేసే సిమెంట్ రేకులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ కృష్ణంరాజు, సభ్యులు నరేష్, శివ, సంతోష్, అశోక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కొత్తూరు : మండలంలోన కర్లెమ్మ పంచాయతీ మహాసింగికి చెందిన వైసిపి నాయకులు పసుపురెడ్డి వెంకటరావు బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి మృతుడి కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈమె వెంట పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, ఎంపిటిసి వి.లక్ష్మీనారాయణ, జి.ఆనందరావు, ఎల్.తిరుపతిరావు, పంకాజ్ దాస్ ఉన్నారు. అలాగే వైసిపి నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు కూడా వెంకటరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈయన వెంట మాజీ సర్పంచ్ పి.వెంకటకృష్ణ ఉన్నారు.

పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న అప్పలసూర్యనారాయణ

అప్పలసూర్యనారాయణ

పలాస : మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ మృతుడు విశ్వనాథం కుటుం బ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన మృతితో రాజకీయ కురువృద్ధుడు లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు.

కిడ్నీ బాధితునికి ఆర్థికసాయం

నౌపడ : సంతబొమ్మాళి మండలంలో నౌపడలో కిడ్నీ భాధితుడు కంబాల ముకుందకు బరంపురానికి చెందిన ఎన్‌టిఆర్ సేవా సమితి ఆర్థికసాయం అందించింది. ఈ మేరకు శనివారం సంఘ ప్రతినిధి నడిమింటి కృష్ణారెడ్డి రూ.15 వేలు నగదును బాధితుడి కటుంబ సభ్యులకు అందజేశారు. ఇలాంటి బాధితులకు, పేదలకు సంస్థ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నడిమింటి నాగరాజు పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మెళియాపుట్టి : సిఎం జగన్‌తోనే సంక్షేమ పథకాలు అమలు సాధ్యమని మారేడుకోట సర్పంచ్ పెద్దింటి భాగ్యం శ్రీనివాసరావు అన్నారు. పంచాయతీ పరిధిలోని పాతమారడికోటలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికీ, ఉపాధి పనులు వద్దకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు బాలకృష్ణ పాల్గొన్నారు.

దుస్తులను అందజేస్తున్న రామారావు

యాచకులకు దుస్తుల పంపిణీ

ఇచ్ఛాపురం : ఇటీవల అనాథ యాచకుని శవానికి హెడ్ కానిస్టేబుల్ తెలుకల రామారావు దహన సంస్కారాలు నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం 30 మంది యాచకులకు అలయన్స్ క్లబ్ సభ్యులు అన్నదాన వితరణ చేశారు. అలాగే రామారావు దుస్తులను పంపిణీ చేశారు. సందర్భంగా రామారావు మానవతా దృక్పథానికి క్లబ్ అధ్యక్షులు నరసింహమూర్తి ప్రశంసించారు. కార్యక్రమంలో సెక్రటరీ తిప్పన లక్ష్మణరావు, పిఆర్ఒ దక్కత గోపీనాథ్‌రెడ్డి ట్రెజరర్ సత్యమయ్య, ఉమా శంకర్, బాల, బుజ్జి, భీ్మ, వాసు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

సీతంపేట : మండలంలోని కీసరజూడు పంచాయలోని కారిగూడలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో రిసోర్స్ పర్సన్ పాలక నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వరి దిగుబడుల పెంపునకు ఆధునిక పద్ధతులు లైన్ షోయింగ్, శ్రీవరి, డ్రమ్స్ విధర్, జమున మోడల్, గురించి వివరించారు. చిరుధాన్యాల పంటలు ఎక్కువ ఉత్పత్తి అయినట్లయితే ఆరోగ్యం, ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. రసాయనిక ఎరువులు బదులుగా ఘనజీవామృతం, ద్రవజీవం పంచిగవ్య, పుల్లటి మజ్జిగ పురుగు మందులు బదులుగా నీమాస్త్రం అగ్నిస్త్రం, బ్రహ్మాస్త్రం, దశపర్ణి కషాయం ఉపయోగించాలని సూచించారు. నీమాస్త్రం సాముహికంగా తయారీలో కారిగూడ, డిబ్బుగూడ, దిగువ కలువరాయి గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వెలుగు అసోసియేషన్ నుండి ఎసిఒ ఎం.గోపాలరావు, సిఒ బి.జగ్గయ్య, జెడ్‌బిఎన్‌ఎఫ్ ఐసిఆర్‌పి ఎల్.బాలరాజు, రవి పాల్గొన్నారు.

పాచిపెంట: జీవన ఎరువులతో విత్తన శుద్ధి చేసి నాటుకుంటే అపరాల్లో అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని విశ్వనాధపురం రైతు భరోసా కేంద్రంలో స్వచ్ఛ ఆర్‌బికెలో పాల్గొంటూ 70 రోజులు తక్కువ కాలపరిమితి గల చిరు సంచులలో ఉన్న మినుము రకం విబిఎన్ -8 రకానికి రైజోబియంతో విత్తన శుద్ధి చేయించారు. 10 కిలోల విత్తనానికి 250 గ్రాముల రైజోబియంను పట్టిస్తే కనీసం దిగుబడి 10 శాతం పెరుగుతుందన్నారు. దీనికిగానూ 250 గ్రాముల రైజోబియంను సరిపడా వేడి నీటిలో 50 గ్రాముల బెల్లం కలిపి 10 కిలోల విత్తనాన్ని దీనిలో వేసి విత్తన శుద్ధి చేసిన తర్వాత రెండు గంటల పాటు నీడలో ఆరబెట్టి వెతుక్కోవాలి. ఈ రైజోబియం తనకు కావాల్సిన నీటిని మొక్క వేర్ల నుంచి పొందుతూ మొక్క పెరుగుదలకు ఆరోగ్యానికి కావాల్సిన నత్రజని స్థిరీకరించి మొక్క గ్రహించేలా చేస్తుందన్నారు. అపరాలు వేర్లపై

సీతంపేట: రైతులకు అవగాహన కల్పిస్తున్న నాగేశ్వరరావు

బుడిపెలులో ఈ రైజోబియం అభివృద్ధి చెంది గాలిలో ఉన్న నత్రజని గ్రహించి భూమిలో స్వీకరించి పంటకు అందించడం వల్ల పంట ఆరోగ్యంగా పెరుగుతుందన్నారు. స్వచ్ఛ ఆర్‌బికె, రైతు భరోసా కేంద్రాలన్నీ పరిశుభ్రంగా ఉంచాలని, దీనికి గాను సెలవు దినాల్లో తప్పనిసరిగా నెలలో ఏదో ఒక రోజు స్వచ్ఛ ఆర్‌బికె దినంగా పాటించి రైతు భరోసా కేంద్రాలను శుభ్రపర్చుకోవాలని రైతులకు వ్యవసాయ శాఖకు అనుసంధానంగా ఉండే ఆర్‌బికెలను పరిశుభ్రంగా ఉంచడం వల్ల విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు ఎక్కువ కాలం పొందుతాయని వచ్చే రైతులకు కూడా ఆహ్లాదకరంగా ఉంటుందని అన్నారు. కావున తప్పనిసరిగా స్వచ్ఛ ఆర్‌బికె పాటించాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు ఆదేశించారు. కార్యక్రమంలో విశ్వనాధపురం రైతు భరోసా కేంద్రం విఎఎ మోహన్ పాల్గొన్నారు.

స్టేడియాన్ని పరిశీలిస్తున్న శాప్ సిఇఒ రామ్‌గోపాల్

క్రీడాకారులను తయారు చేయాలి

సీతంపేట: మంచి క్రీడాకారులను తయారు చేయాలని ఎపి స్పోర్ట్స్ అథారిటీ శ్రీకాకుళం, పార్వతీ పురం మన్యం జిల్లాల శాప్ సిఇఒ బి. రామ్ గోపాల్ అన్నారు. శనివారం ఐటిడిఎ సమీపంలో ఉన్న గ్రీన్ ఫీల్డ్ స్టేడియంను ఆయన సందర్శించారు. బాస్కెట్ బాల్, వాలీబాల్, బాడ్మింటన్, టెన్నిస్ చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేసవి శిబిరాలు నిర్వహించాలన్నారు. అవసరమైతే శిక్షణ కోచ్‌లను ఇస్తామన్నారు. క్రీడాకారులకు స్పోర్ట్స్ సంబంధించి ఏవైనా ఉంటే ప్రతిపాదనలు పంపించాలని చెప్పారు. కొత్త గేమ్స్ నిర్వహించాలన్నారు. ఆయనతో పాటు ఐటిడిఎ స్పోర్ట్స్ ఇంచార్జ్ ఎన్ జాకప్ దయానంద్ తదితరులు ఉన్నారు.

సీతంపేటలో వర్షం

సీతంపేట: గత వారం రోజులుగా విపరీతమైన ఎండలతో అల్లాడిపోతున్న జనానికి శనివారం కురిసిన వర్షం ఉపసమనాన్ని కలిగించింది. ఒక్కసారిగా మేఘామృతమై భారీ వర్షం కురవడంతో వాతావరణ చల్లబడింది. దీంతో రైతులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే మామిడి రైతులు మాత్రం నష్టపోతామని వాపోతున్నారు.